సాక్షి
ఆదిలాబాద్
గురువారం | 24 | జూలై | 2025



హెల్మెట్ మస్ట్..!

ద్విచక్ర వాహనాలకు సంబంధించిన ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్ లేక మృత్యువాత పడుతన్నారు. పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నా మార్పురావడం లేదు. 8లో



సీఆర్టీ పోస్టులకు 27న రాత పరీక్ష

గిరిజన ఆశ్రమ/ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టుల భర్తీ కోసం ఈనెల 27న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా తెలిపారు. 8లో

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని ఎంపీ గోడం నగేశ్ బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో విమానాశ్రయ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, ఈ నెల 4న రక్షణ, విమానయాన శాఖ అధికారులు అలాగే రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిగినట్లు మంత్రి ఎంపీకి తెలిపారు. ఈ చర్చలకు కొనసాగింపుగా తమ వద్ద సైతం సమావేశం ఏర్పాటు చేయాలని ఎంపీ విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ వివరించారు.

మంత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: జీవో 49 నిలుపుదలకు ప్రత్యేక కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాకు 'రెడ్' అలర్ట్




ఆదిలాబాద్ పట్టణంలో కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లావ్యాప్తంగా బుధవారం వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో పంటల ఎదుగుదలపై ప్రభావం చూపింది. ఎట్టకేలకు కురిసిన వానతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. పలుచోట్ల రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగం సూచిస్తోంది.

నేటి నుంచి పాలిటెక్నిక్ రెండో విడత కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం రెండో విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బండి రాంబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. 24న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. మొదటి విడత హాజరు కాని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 24, 25 తేదీల్లో వెబ్ ఆప్షన్లు, 28న సీట్ అలాట్మెంట్ ఉంటుందని పేర్కొన్నారు. 29న ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని, 30 వరకు కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు. 31న సీట్ కన్ఫామ్ చేసుకోవాలి పేర్కొన్నారు. ఒక బ్రాంచ్ నుంచి మరో బ్రాంచ్‌కు మారడానికి ఆగస్టు 2, 3 తేదీల్లో స్లైడింగ్ ఆప్షన్లు ఉంటాయని, 6న మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు వివరించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



తరగతులు బహిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపట్టారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగా సెలవు ప్రకటించగా, తెరిచి ఉన్న ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లి మూసివేయించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గణేశ్, కేశవ్, మెస్రం భాస్కర్, వరుణ్, నవీన్, సురేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



జీవో నం.49 నిలుపుదల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జిల్లా నాయకులు (ఫైల్)

49.. రాజకీయం!

- జీవో నిలుపుదలపై క్రెడిట్ కోసం కాంగ్రెస్ నేతల పాట్లు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎత్తుగడ అంటున్న ఆదివాసీలు
- పూర్తిగా రద్దు చేసేవరకు పోరాటం ఆగదంటున్న ట్రైబల్స్

సాక్షి,ఆదిలాబాద్: కుమురంభీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకొచ్చిన జీవో నం.49ను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేయడాన్ని కాంగ్రెస్ నేతలు రాజకీయంగా మైలేజ్ పొందేందుకు యత్నిస్తున్నారు. రాష్ట్రంలోని హస్తం పార్టీ గిరిజన ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలంతా కలిసి ఈ జీవో నిలుపుదల విషయంలో తీవ్ర ప్రయత్నాలు చేశామని చెబుతున్నారు. అయితే ఇది స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసిందని, దాన్ని పూర్తిగా రద్దు చేసేంత వరకు మా పోరాటం ఆగదని ఆదివాసీలు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గట్టిగా ప్రయత్నాలు చేయాలని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లా బంద్ ప్రభావంతో..

ప్రస్తుతం జీవో నం.49 చుట్టే రాజకీయ చర్చ సాగుతుంది. ప్రధానంగా గత సోమవారం ఈ జీవోను వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు బంద్ పిలుపునివ్వడం, అది సక్సెస్ కావడంతో ఆ సాయంత్రమే రాష్ట్ర ప్రభుత్వం నుంచి తాత్కాలిక నిలిపివేత నిర్ణయం వెలువడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అదే రోజు హైదరాబాద్‌లో హస్తం పార్టీకి చెందిన గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను సన్మానించారు. ఆ తర్వాత ఆదివాసీ సంఘాలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించాయి. అయితే దీన్ని పూర్తిగా రద్దు చేసేవరకు తమ పోరాటం ఆపమని స్పష్టం చేస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 28న కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు సమాయత్తం అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆదివాసీ సంఘాలు దిగివచ్చాయని అనుకుంటున్న సందర్భంలో మహా ధర్నా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. మరోవైపు కాంగ్రెస్ నేతలు ఈ జీవోను నిలుపుదల చేశామంటూ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తుండటం గమనార్హం. మొత్తంగా ప్రస్తుతం జరుగుతున్న ఈ పరిణామాలు రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి..

తాత్కాలికంగా నిలుపుదల చేసిన ఈ జీవో విషయంలో ఆదివాసీలు ఒకవైపు హర్షం వ్యక్తం చేస్తూనే మరోవైపు పూర్తిస్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలంటున్నారు. ఈ జీవో విషయంలో ఆదివాసీ సంఘాలు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నాయి. ప్రస్తుతం తాత్కాలికంగా నిలుపుదలతో పోరాటాన్ని విరమించకుండా ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నాయి. అందులో భాగంగానే కుమురంభీం ఆసిఫాబాద్‌లో త్వరలో మహాధర్నాకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆదివాసీలకు అండగా ప్రజాప్రభుత్వం



ఆదివాసీలకు ప్రజాప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుంది. జీవో నం.49 నిలుపుదల విషయంలో గతంలో ఆదివాసీలకు మాట ఇచ్చాను. దాన్ని నిలబెట్టుకున్నాను. ప్రభుత్వం అన్ని కోణాల్లో చర్చించి నిలుపుదల నిర్ణయం తీసుకోవడం జరిగింది. మంత్రుల విజ్ఞప్తి, ఆదివాసీల ఆందోళన, అధికారుల నివేదికలను పరిశీలించిన సీఎం జీవో నిలుపుదలకు ఆదేశించారు. దానికి అనుగుణంగా అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

– జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

పోరాటం ఆగదు..



ఆదివాసీ ప్రజా ఉద్యమం కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం జీవోను నిలుపుదల చేసింది. అయితే రద్దయ్యే వరకు మా పోరాటం ఆగదు. 28న కుమురంభీం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నాకు పిలుపునిచ్చాం. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఉంది.

– గోడం గణేశ్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు

కళాశాలపై నిఘా



సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరజ్



తరగతి గదిలో అమర్చిన సీసీ కెమెరా

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సీసీ కెమెరాలు
- కమిషనరేట్ నుంచే పర్యవేక్షణ
- అధ్యాపకుల గైర్హాజరుకు ఇక చెక్
- విద్యార్థులకు అందనున్న నాణ్యమైన బోధన

జిల్లాలో
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు : 13
ప్రథమ సంవత్సరం విద్యార్థులు : 3,100
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు : 3,506

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ కళాశాలల అభివృద్ధిపై సర్కారు దృష్టి సారించింది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సర్కారు కళాశాలల్లో నిఘా ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాలతో పర్యవేక్షణకు శ్రీకారం చుట్టింది. ఆయా కాలేజీల నుంచి నేరుగా ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనరేట్‌కు వీటిని అనుసంధానం చేశారు. తరగతులకు డుమ్మా కొట్టే విద్యార్థులు, సక్రమంగా విధులు నిర్వహించని గురువులకు చెక్ పడనుంది. ఈ ప్రక్రియ ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరగనుండడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందనుంది. తద్వారా ఉత్తీర్ణత శాతం మెరుగుకానుంది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో ఒక్కో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 14 సీసీ కెమెరాల చొప్పున అమర్చారు. తరగతి గది, కళాశాల ముందు భాగం, ఆవరణలో వీటిని ఏర్పాటు చేశారు. విద్యార్థినులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా ఇట్టే తెలిసిపోనుంది. వీటి ఏర్పాటుతో బాలికలకు మరింత భరోసా కలగనుంది. అలాగే లెక్చరర్ల సమయపాలన తీరు తెలుస్తోంది. ఏ తరగతి కూడా లెక్చరర్ లేకుండా ఉండకూడదు. అలాగే ఒకరికి బదులు మరొకరు బోధించే పరిస్థితికి చెక్ పడనుంది. ఇక ప్రతీ విద్యార్థికి 75 హాజరు శాతం ఉంటేనే పరీక్షలకు అనుమతించనున్నారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం కూడా మెరుగుపడనుంది.

తరగతులు బోధించాల్సిందే..

జిల్లాలోని చాలా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇదివరకు కనీసం ప్రార్థన కూడా నిర్వహించని పరిస్థితి ఉండేది. ఇక ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అలాగే ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు బోధించాల్సిందే. దీనికి సంబంధించి టైంటేబుల్ సైతం సిద్ధం చేశారు. ప్రతీ గదిలో సీసీ కెమెరా ఏర్పాటు కారణంగా లెక్చరర్లు ఇక కాలక్షేపం చేయడానికి అవకాశం లేదు. అలాగే విద్యార్థులు సైతం తప్పనిసరిగా తరగతి గదిలో కూర్చోవాల్సిందే. ఈ సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ కమాండెంట్‌కు అనుసంధానం చేశారు. ఉమ్మడి జిల్లా కళాశాలల పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌కు డిప్యూటీ సెక్రెటరీగా ఉన్న ఆర్.వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో దాదాపు 200 మంది జూనియర్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అంతగా అధ్యాపకుల కొరత లేదు. గుడిహత్నూర్, తలమడుగు, నార్నూర్ మండలాల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు ఉన్నారు. ప్రస్తుతం లెక్చరర్లకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తుండగా, ఆగస్టు 1 నుంచి ఫేషియల్ అటెండెన్స్ అమలు కానుంది. దీంతో ఆయా కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మేలు చేకూరనుంది.

అన్ని కళాశాలల్లో సీసీ నిఘా..



జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ నిఘా ఏర్పాటు చేశాం. ఒక్కో కళాశాలలో 14 కెమెరాల చొప్పున అమర్చడం జరిగింది. వీటి ద్వారా లెక్చరర్ల సమయపాలన, కచ్చితంగా బోధన, చదువులో నాణ్యత పెరుగుతుంది. ఏవైనా సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతాయి. వీటిని ఆయా కళాశాలల నుంచి హైదరాబాద్‌లోని ఇంటర్మీడియెట్ బోర్డు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడం జరిగింది. పర్యవేక్షణ కోసం ఉమ్మడి జిల్లాకు ఒక్కరు చొప్పు న ప్రత్యేక అధికారులను నియమించారు.

– జాదవ్ గణేశ్‌కుమార్, డీఐఈవో

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- కలెక్టర్ రాజర్షి షా



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం నిర్వహించిన మహాలక్ష్మి సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఇప్పటి వరకు 200 కోట్ల మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారన్నారు. ప్రయాణ చార్జీల రూపంలో రూ.6,680 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తోందని వెల్లడించారు. జిల్లాలో 1.75 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని వివరించారు. అనంతరం బస్టాండ్‌లో తీర్చిదిద్దిన రంగవల్లులను వీక్షించి ప్రయాణికులు, విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. పలువురు మహిళా ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందిని సన్మానించారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ సలోని, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోమరాజు భవాని ప్రసాద్, డిపో మేనేజర్ ప్రతిమ, సారథి కళాకారులు ప్రయాణికులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను కలెక్టర్ రాజర్షిషా బుధవారం రాత్రి తనిఖీ చేశారు. భోజన, వసతిగృహ శుభ్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వలను పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, విద్యాబోధన తీరుపై ఆరా తీశారు.

28 నుంచి రేషన్‌కార్డుల పంపిణీ

కైలాస్‌నగర్: జిల్లాలో ఈ నెల 28నుంచి రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా వైద్య అధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న ఉదయం బోథ్ నియోజకవర్గంలో, మధ్యాహ్నం ఆదిలాబాద్ నియోజకవర్గంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్లాంటేషన్ ప్రక్రియ ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందజేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏటీసీలో ప్రవేశాలపై దృష్టి సారించాలి

ఐటీఐలలో ఏర్పాటు కానున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లో ఈ విద్యాసంవత్సరానికి విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు గాను మొబిలైజేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో టీ–గేట్ సభ్యులు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఈవో గణేశ్‌కుమార్, డీఈవో కే.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు తొమ్మిది మంది ప్రొఫెసర్లు

- పదోన్నతి ద్వారా జిల్లాకు రాక
- మెరుగు పడనున్న వైద్యసేవలు
- ఎట్టకేలకు ఖాళీల భర్తీ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం ఎట్టకేలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేసింది. ఆదిలాబాద్ రిమ్స్‌కు తొమ్మిది మందిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ప్రాంతవాసులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. 2008లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి రిమ్స్‌ను ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇందులో ఖాళీలు వెక్కిరిస్తుండగా, ఇటీవల వరుసగా పోస్టులను భర్తీ చేస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మెడికల్ కళాశాలల్లో ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. రిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ వైద్యుడు అశోక్‌కు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. అలాగే ఇతర జిల్లాల నుంచి మరో 8 మంది పదోన్నతిపై వస్తున్నారు. ప్రమోషన్ పొందిన వారిని వెంటనే విడుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 15 రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. రిమ్స్‌లో మొత్తం 21 విభాగాలు ఉండగా, 17 విభాగాల్లో ప్రొఫెసర్లు ఉన్నారు. మిగతా విభాగాల్లోనూ నియమించారు.

రిమ్స్‌కు వస్తున్న ప్రొఫెసర్లు వీరే..

ప్రొఫెసర్ పేరు	విభాగం	ప్రస్తుతం పనిచేస్తున్న మెడికల్ కళాశాల
డాక్టర్ రహమతున్నిసా	ఆప్తమాలజీ	ప్రభుత్వ మెడికల్ కాలేజ్, నల్గొండ
డాక్టర్ కె.రమేశ్	ఈఎన్‌టీ	కోఠి, హైదరాబాద్
డాక్టర్ ఎస్.కవిత	పీడియాట్రిక్	కాకతీయ మెడికల్ కాలేజ్, హన్మకొండ
తానాజీ జాడే	జనరల్ మెడిసిన్	నిజామాబాద్
డాక్టర్ అశోక్	జనరల్ సర్జన్	ఆదిలాబాద్ రిమ్స్
డాక్టర్ పి.శ్రీదేవి	అనస్తీషియా	జనగాం
డాక్టర్ ఎల్.సంతిలత	గైనిక్	నిజామాబాద్
డి.సంధ్యారావ్	రేడియాలజీ	నల్గొండ
బి.విజయనిర్మల	పాథాలజీ	నిలోఫర్, హైదరాబాద్

అప్రమత్తంగా ఉండాలి

ఉట్నూర్‌రూరల్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఉట్నూర్ పోలీసు స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐ మడావి ప్రసాద్, ఎస్సై ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- ఘనంగా నర్సింగ్ గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్‌టౌన్: వృత్తిని దైవంగా భావించి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. బుధవారం రిమ్స్ ఆడిటోరియంలో నర్సింగ్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ వైద్యసేవల్లో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు దీపక్ పుష్కర్, బండారి నరేందర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతి గురు, శుక్రవారాల్లో విద్యార్థులకు సీపీఆర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఫీవర్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో స్టాఫ్ నర్సులు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని పే ర్కొన్నారు. వైద్యాధికారులతో పాటు సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుడి హత్యకేసులో నిందితుడి రిమాండ్

భైంసాటౌన్: కుభీర్ మండలంలోని చాత గ్రామంలో ఈనెల 17న రాత్రి బలరాం గౌడ్ అనే వృద్ధుడి హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన బలరాం గౌడ్ స్థానికంగా కల్లు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో 17న గ్రామానికే చెందిన సిల్మల సంతోష్ ఇంట్లోకి చొరబడి కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం ఇంట్లోని రూ.1.50లక్షల నగదు తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేయగా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో మెరుగైన దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. నిందితుడు సంతోష్ మద్యానికి బానిసై చిన్నపాటి చోరీలు చేసేవాడని, గతంలోనూ నిందితుడిపై చోరీ కేసు నమోదైనట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తులు, గొడ్డలితోపాటు చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డిని ఆయన అభినందించారు. సమావేశంలో పట్టణ సీఐ జి.గోపీనాథ్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి

మంచిర్యాలక్రైం: విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి చెందినట్లు ఏఎస్సై వెంకన్న గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన నాతర్ల రఘు ఐడీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగి. అతని భార్య జయకు దగ్గరి బంధువైన జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన నాతర్ల పోసవ్వ (70) కొంతకాలంగా ఇక్కడే ఉంటోంది. బుధవారం బట్టలు ఆరేస్తుండగా గోడకు ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ నెల 20న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్సై దివాకర్ తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన కుడుదల లక్ష్మణ్ (62) తన అల్లుడు ఇప్ప శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై చెన్నూర్ నుండి మంచిర్యాలకు వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఇద్దరికి గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి లక్ష్మణ్ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గల్ఫ్‌లో పెద్దూర్ వాసి..


సురేష్ (ఫైల్)

దస్తురాబాద్: బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దూర్ గ్రామానికి చెందిన సంఘ సురేష్ (35) నెల రోజుల క్రితం ఉపాధి నిమిత్తం ఉజ్జకిస్థాన్ దేశానికి వెళ్లాడు. ఓ కంపెనిలో పనిచేస్తుండగా సోమవారం గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహన్ని తెప్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

'కోలిండియా క్రీడాకారులనే కోఆర్డినేటర్‌గా నియమించాలి'

శ్రీరాంపూర్: కోలిండియా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులనే ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా నియమించాలని ఐఎన్టీయూసీ నాయకులు సంస్థ యాజమాన్యాన్ని కోరారు. బుధవారం యూనియన్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో నాయకులు జీఎం కార్యాలయంలో ఎస్‌వోటు జీఎం ఎస్. సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, తిరుపతి రాజు, ప్రధాన కార్యదర్శులు ఏనుగు రవీందరెడ్డి, జీవన్ జోయల్, చాట్ల అశోక్, నాయకులు నరేందర్, ప్రసాద్, రౌతు సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


రాములు (ఫైల్)

కుంటాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన ఏముల రాములు(22) మూడు నెలల క్రితం గల్ఫ్ నుంచి తిరిగివచ్చాడు. బుధవారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఓలా వెళ్లి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని తండ్రి రాములు, తమ్ముడు లక్ష్మణ్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హెల్మెట్ మస్ట్..!



పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణయ్య యాదవ్ తండ్రి ఐలయ్య యాదవ్ (64) ఈనెల 18న ద్విచక్రవాహనంపై హాజీపూర్ వైపు నుంచి మంచిర్యాలకు బయలుదేరాడు. పాత మంచిర్యాల వద్ద వెనుకనుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు హెల్మెట్ ధరించి ఉంటే స్వల్ప గాయాలతో బయటపడేవాడని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

- రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తం
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 70 మంది మృతి
- హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్యనే ఎక్కువ
- నాసిరకం శిరస్త్రాణాలతో మొదటికే మోసం

మంచిర్యాలక్రైం: వాహనాలు మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఇతరులకు ప్రాణాంతకమవుతోంది. రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందుతుండగా వందల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. ఈ ఏడాది మంచిర్యాల జిల్లాలో ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాల్లో 70 మంది మృతి చెందారు. ఇందులో అధికశాతం హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, తదితర అంశాలపై నిత్యం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులపై కొరడా ఝులిపిస్తున్నా మార్పురావడం లేదు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాణాలతో బయటపడతారని అవగాహన కల్పిస్తున్నారు. అయినా వాహనదారుల్లో మార్పురావడంలేదు. కొంతమంది హెల్మెట్ ధరించకుండా బైక్‌కు వెనకాల తగిలించుకుని రయ్‌మని వెళ్తున్నారు. తీరా ప్రమాదాలు జరిగిన తర్వాత హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవని చర్చించుకోవడం ప్రజలవంతు అవుతోంది.

నిర్లక్ష్యంతోనే..



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంలో చేస్తున్న నిర్లక్ష్యమే నిండు ప్రాణాలను బలితీసుకుంటోంది. కొందరు చలానాలు తప్పించుకోవడానికి తప్పదన్నట్లు ధరిస్తుంటారు. రోడ్డు పక్కన రూ.150, రూ.200 చెల్లించి నాసిరకం హెల్మెట్‌లు కొనుగోలు చేస్తున్నారు. అయినా వాటిని ధరించకుండా బైక్ వెనుకాలో, ముందో తగిలేసి హెల్మెట్ ఉందిలే అని దర్జాగా వెళ్తున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.

– ప్రమోద్‌రావ్, పట్టణ సీఐ, మంచిర్యాల

నాణ్యత పాటించాలి



వాహనం కొనుగోలు చేసేటప్పుడు హెల్మెట్ ఖచ్చితంగా తీసుకోవాలని చెబుతున్నాం. ధర ఎక్కువైనా ఐఎస్ఐ మార్కు ఉన్న నాణ్యమైన హెల్మెట్ వాడాలి. శిరస్త్రాణం ధరించడం వల్ల జుట్టు ఊడిపోతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అది అపోహ మాత్రమే. వేసవిలో ఎండ తీవ్రత 40 డిగ్రీల వరకు ఉంటోంది. పది నిమిషాలు ఎండలో తిరిగినా వడదెబ్బ తగిలే అవకాశాలున్నాయి. ముఖ్యంగా హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుంది.

– జాడి సత్యనారాయణ, వేర మోటార్స్ హీరో బైక్ షోరూం జనరల్ మేనేజర్, మంచిర్యాల

ప్రజల భద్రత కోసమే...



ద్విచక్ర వాహనాదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి. రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ప్రజల భద్రత కోసమే నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. పలు రోడ్డు ప్రమాదాల్లో వెనకాల కూర్చున్న పిలియన్ రైడర్లు కూడా ప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. బైక్ నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించడంపై కొందరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అది వారి ప్రాణాలకే ప్రమాదం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

తలకు దెబ్బతగిలితే...



సాధారణంగా తలకు దెబ్బతగిలినప్పుడు కొద్ది సెకన్లపాటు స్పృహకోల్పోవడం, తల నొప్పి, ఆయోమయం, తల తేలికగా ఉన్నట్లు అనిపించడం, దృష్టి మసక బారడం, చెవిలో హోరుమనే శబ్దం, రుచి తెలియక పోవడం, బాగా అలసటగా ఉన్నట్లు అనిపించడం, నిద్రవేళ ప్రవర్తనలో మార్పులు, జ్ఞాపక శక్తి, దృష్టి కేంద్రీకరణలో మార్పులు సంభవిస్తాయి. తీవ్రగాయాలు అయితే వికారం, ఫిట్స్, మాట ముద్దగా రావడం, ఏదైనా అవయవంలో బలహీనత లేదా తిమ్మిర్లు, ఆలోచనలకు, చేతులకు సమన్వయం లోపించడం, తీవ్రమైన అయోమయం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొన్నిసార్లు బయటకు గాయంలేకపోయినా లోపల సమస్య ఏర్పడుతుంది. పుర్రెలో ప్రత్యేక ద్రావణంలో మెదడు తెలియాడుతూ ఉంటుంది. ప్రమాద సమయంలో తలకు తీవ్ర గాయమైతే మెదడు పుర్రె గోడలకు కొట్టుకుంటుంది. దీని వల్ల మెదడులోని రక్త నాళాలు దెబ్బతిని హిమాటోమాకు దారితీసి తీవ్రరక్త స్రావం జరుగుతుంది.

– డాక్టర్ అభినవ్, జనరల్ ఫిజీషియన్, ప్రభుత్వ ఆసుపత్రి, మంచిర్యాల

ప్రాణాలతో బయటపడ్డా..



హెల్మెట్ ధరించినప్పుడు మెడకింద బెల్టు సక్రమంగా ఉందో లేదో చూసుకోవాలి. లేదంటే ప్రమాదం జరిగినప్పుడు తలకు హెల్మెట్ ఉన్నా ఎలాంటి ఉపయోగం ఉండదు. వేలల్లో కేసులు నమోదవుతున్నా వాహనదారుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. కొందరు నాసిరకం హెల్మెట్ వినియోగిస్తున్నారు. మరి కొందరు హెల్మెట్‌ను బండికి తగిలేసి వెళ్తున్నారు. పోలీసులు ఉన్నారని తెలియగానే బెల్టు పెట్టుకోకుండానే తలకు తగిలేస్తున్నారు. దీంతో ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ఊడిపోవడంతో తలకు తీవ్రగాయాలై మృత్యువాత పడుతున్నారు. ఒకసారి నేను కూడా రోడ్డు ప్రమాదానికి గురయ్యా. హెల్మెట్ ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డా.

– కే.మనోజ్‌కుమార్, బైక్ రైడర్, మంచిర్యాల

నవోదయలో ప్రవేశానికి 29 తుదిగడువు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు సూచించిన విధంగా కుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తిన కారణంగా నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాగు దాటితేనే కూలి..


వాగులోంచి వెళ్తున్న మహిళా కూలీలు

భీమారం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఎలకేశ్వరం గ్రామ సమీపంలోని మంచినీళ్ల వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. వాగుపై వంతెన నిర్మించకపోవడంతో ఏటా వర్షాకాలంలో వ్యవసాయ కూలీలు, స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మహిళా కూలీలు మోకాలు లోతులో ప్రవహిస్తున్న నీటిని దాటుకుంటూ వెళ్లారు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితుల్లో తాము విధిలేని పరిస్థితుల్లో వాగు దాటి కూలిపనులకు వెళ్తున్నామని మహిళలు పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో మూడోవిడత కౌన్సెలింగ్

బాసర: ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి ఈనెల 25న మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్‌ఫిల్ట్ గ్లోబల్ కోటాలో గ్లోబల్ ఆప్షన్‌ను ఎంచుకున్నవారి కోసం జూలై 24న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా కింద సీట్ల భర్తీకి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డ్రైయినేజీలోపడి వృద్ధురాలు మృతి

- ఇరువర్గాల గొడవలో తోసివేయడంతో ఘటన


బుచ్చమ్మ మృతదేహం

జన్నారం: ప్రహరీ విషయంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న గొడవను ఆపేందుకు వెళ్లిన వృద్ధురాలిని తోసివేయడంతో డ్రైయినేజీలో పడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం లింగయ్యపల్లి గ్రామానికి చెందిన గొట్ల గంగయ్య, అయ్యోరు సత్తయ్య, అయ్యోరు చంద్రమౌళి కుటుంబాల మధ్య ప్రహరీ విషయంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి గంగయ్య చిన్న కుమారుడు తిరుపతి, సత్తయ్య, చంద్రమౌళి మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాల వారు కర్రలతో కొట్టుకున్నారు. వారిని ఆపడానికి వెళ్లిన గంగయ్య భార్య గొట్ల బుచ్చమ్మ (61)ను సత్తయ్య, చంద్రమౌళి తోసివేయడంతో డ్రైయినేజీలో పడిపోయింది. వృద్ధురాలిని ఎవరూ గమనించకపోవడంతో రాత్రంతా డ్రైయినేజీలోనే ఉండిపోయింది. బుధవారం తెల్లవారుజామున మృతదేహం కనిపించడంతో మృతురాలి భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు సత్తయ్య, చంద్రమౌళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

నెన్నెల: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన రత్నం శంకర్ పెంకుటిల్లు బుధవారం నేలమట్టమైంది. శంకర్ తన భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రమాద సమయంలో తల్లి మల్లక్క ఇంటి బయట ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న టీవీ, ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయని, రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. మైలారంలో ప్రేంసాగర్‌గౌడ్ ఇంటిగోడ కూలి బీరువా, ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయని బాధితుడు తెలిపాడు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

నార్నూర్: ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఏడాది క్రితం రూ.12,50,000, ఎస్టీ కార్పొరేషన్ నుండి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1,90,000 తీసుకున్నాడని తెలిపారు. గాదిగూడ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన హెచ్‌కే వినోద్ కుమార్, లోకారి బి గ్రామానికి చెందిన మడావి శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఆరే ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య

భైంసారూరల్: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుప్రియ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వాడి గ్రామానికి చెందిన కళ్యాణ్ కొండిబా (87)కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం కడుపునొప్పిగా ఉందని బహిర్భూమికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తన సోదరుడు సాయిబాబు పంట పొలానికి వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య గోదావరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మద్యానికి బానిసై ఒకరు..

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీసాయి తెలిపిన వివరాల మేరకు మండలంలోని బాబెరతాండకు చెందిన జాదవ్ శివరాం (44)వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం పత్తి పంటకు మందు పిచికారీ చేస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కొంతసేపటికి అతని భార్య సురేఖ బాయి భర్తకు భోజనం తీసుకెళ్లగా అప్పటికే పురుగుల మందు తాగాడు. వెంటనే ఆటోలో బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. కాగా తన భర్త కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడని, మద్యం తాగిన మైకంలో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు సురేఖ బాయి తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావను కొట్టిచంపిన బామ్మర్దులు

తలమడుగు: మద్యం మత్తులో బావను కొట్టిచంపిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల మేరకు నడుంపల్లి గ్రామానికి చెందిన నైతం పగ్గు (55) బతుకుదెరువు కోసం రుయ్యాడి గ్రామానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం నడుంపల్లెకు చెందిన అతని బామ్మర్దులు ఆత్రం భగవంతు, ఆత్రం రాములు పగ్గు ఇంటికి వచ్చారు. ముగ్గురూ కలిసి బయటకు వెళ్లి మద్యం సేవించారు. మద్యం మత్తులో వారి గ్రామదేవతల పండుగ విషయంలో చందాలివ్వలేదని మాటా మాట పెరిగి పగ్గును కొట్టుకుంటూ వచ్చి అన్సేన్ హన్సేన్ దేవస్థానం ఎదురుగా ఉన్న మురికి కాలువలో పడేశారు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన 108కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సీఐ ఫణీందర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖండాల వాటర్ ఫాల్‌లో ఒకరి గల్లంతు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఖండాల వాటర్‌ఫాల్‌లో ఒకరు గల్లంతైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన మనోహర్‌సింగ్ (17) బుధవారం పలువురు స్నేహితులతో కలిసి ఖండాల వాటర్ ఫాల్‌కు వెళ్లాడు. నీటిలో గల్లంతు కావడంతో చీకటి పడేంత వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. బాధితుని తండ్రి దుంగల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం భవానీ ప్రసాద్

ఆదిలాబాద్: ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్.భవానీ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ డిపోలో డ్రైవర్ల రోడ్డు భద్రత అవగాహన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో తమ సర్వీసులో యాక్సిడెంట్స్, డామేజ్ చేసిన 46 మంది డ్రైవర్లకు రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రహదారి భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుతుందన్నారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న సేవా సమితి సిబ్బంది

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. 58 రోజులపాటు భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి సమర్పించిన ఆలయ హుండీని ఆలయ కార్య నిర్వహణ అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.89,79,396 నగదు, మిశ్రమ బంగారం 85 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలోల 700 గ్రాములు, విదేశీ కరెన్సీ 25 నోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పరిపాలనా వైదిక సిబ్బంది, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, రాజన్న సిరిసిల్ల భక్తులు పాల్గొన్నారు.

సీఆర్టీ పోస్టులకు 27న రాత పరీక్ష

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆశ్రమ/ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ (ఎస్‌జీటీ) పోస్టుల భర్తీ కోసం ఈ నెల 27న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న పరీక్షకు అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్, గుర్తింపు కార్డు, బ్లాక్‌బాల్ పెన్ను లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే వెంట తీసుకురావాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకురావద్దన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అభ్యర్థులకు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో, ఆసిఫాబాద్ జిల్లా అభ్యర్థులకు ఆసిఫాబాద్‌లో రాత పరీక్ష ఉంటుందని వివరించారు.

మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలి

- సీఎండీకి టీబీజీకేఎస్ నేతల వినతి


సీఎండీతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలని టీబీజీకేఎస్ నాయకులు బుధవారం ఆయూనియన్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్.బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీనెల నిర్వహించాల్సిన మెడికల్ బోర్డును 4 నెలలుగా నిర్వహించకపోవడం వల్ల దరఖాస్తు చేసుకున్న కార్మికులు తీవ్రఇబ్బంది పడుతున్నారన్నారు. హయ్యర్ సెంటర్‌కు రిఫరల్ అయిన కేసులు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కంపెనీ ఆసుపత్రుల్లో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందుల కొరత తీర్చాలని, భూగర్భ, ఓపెన్ కాస్టు గనుల్లో అవసరమైన యంత్రాలను సత్వరమే కొనుగోలు చేయాలని, కంపెనీ లాభాలను ప్రకటించి కార్మికులకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, హరిప్రియనాయక్, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, నాయకులు కోలేటి దామోదర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలను మభ్యపెడుతున్న ప్రభుత్వం'


నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జీవో 49 తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఆదివాసీలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆదివాసీ గిరిజన సంఘాలు ఆరోపించాయి. ఉట్నూర్ ప్రెస్ భవన్ ఆవరణలో బుధవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ బాదిరావు, ఆదివాసీ అడ్వకేట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, తుడుం దెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు, ఆడ హనుమంతరావు, తదితరులు మాట్లాడారు. పులుల సంరక్షణ కోసం పాకులాడుతున్న ప్రభుత్వం ప్రజల ప్రాణాలను కాపాడడంలో విఫలమవుతుందన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటుతో ఇప్పటికే గిరిజన గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో రద్దు ఉత్తర్వులను పూర్తిగా చదవాలని, ఆర్భాటాలు చేస్తూ క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు రానున్న రోజుల్లో జరిగే పరిణామాలు గుర్తుంచుకోవాలన్నారు. ఈనెల 28న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జీవో 49 రద్దు చేసే వరకు ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి


శ్రద్ధా శుక్లాకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు


హ్యాండ్‌బాల్ ఆడుతున్న నవోదయ క్రీడాకారులు

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా
- నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. బుధవారం పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్‌స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. కాగజ్‌నగర్‌లో క్లస్టర్ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పార్వతి ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్ నిర్వహించారు.

నలుగురు యువకుల బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ బస్టాండ్ నుంచి టీకానపల్లికి వెళ్లే రహదారిలో ఇటీవల మద్యం మత్తులో వీరంగం సృష్టించిన నలుగురు యువకులను హాజీపూర్ పోలీసులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. హాజీపూర్ మండలానికి చెందిన ఆనె అంజి, కొల్లూరి అభిషేక్, చల్లం శ్రీను, కలమడుగు జశ్వంత్ మద్యం మత్తులో వచ్చిపోయే వారిని భయభ్రాంతులకు గురి చేశారు. నిందితులకు రూ.లక్ష జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించేలా తీర్పు చెబుతూ ఒక సంవత్సర కాల వ్యవధి కోసం బైండోవర్ చేశారు.